క్లుప్తంగా

ప్రజా కాపునాడు నూతన కార్యవర్గం ఎన్నిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 26వ డివిజన్ ప్రజా కాపునాడు నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవం అయ్యింది. ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యాన నూతన కార్యవర్గం ఎన్నిక మాచవరంలో జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా బిశెట్టి భాస్కరరావు, మహిళా అధ్యక్షురాలుగా పసుపులేటి దుర్గాభవాని, ప్రధాన కార్యదర్శి పులిగోరు సుధాకర్‌నాయుడు, కార్యదర్శి పనిశెట్టి నాగేశ్వరరావు, మహిళా కార్యదర్శి ఉమ్మడి మల్లేశ్వరి, సప్పరపు లక్ష్మి, సిద్ధంశెట్టి రమాదేవి, ఏమని నాగలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం నాయకులకు యర్రంశెట్టి అంజిబాబు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాపులంతా ఐక్యంగా ఉండాలని కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.

ఉచిత కార్మిక పాఠశాల ప్రారంభం



ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికులకు విద్యను నేర్పించేందుకుగాను ఉచిత కార్మిక పాఠశాల ఎంతగానో దోహదపడుతుందని ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు అన్నారు. ఆటోనగర్‌లోని ఏటీఏ హాలులో పాఠశాలను ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ శివన్నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విజయవాడ ఆటోనగర్‌కు ఆసియా ఖండంలోనే అతి పెద్ద పారిశ్రామికవాడగా పేరు ఉందన్నారు. ఇక్కడకు వచ్చే అత్యధిక శాతం కార్మికులకు నైపుణ్యం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పెంచుకోవాలని ఉన్నప్పటికీ అనేక కారణాలతో సాధ్యం కావడం లేదన్నారు. అటువంటి కార్మికులకు ఉచితంగా శిక్షణ అందుబాటులోకి తెచ్చే చిరు ప్రయత్నమే కార్మిక పాఠశాల అని పేర్కొన్నారు. ఈ పాఠశాల ఉదయం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఉంటుందన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ప్రైవేట్‌గా రాయాలనుకునే వారికి అనుగుణంగా కంప్యూటర్‌పై ప్రాథమిక శిక్షణను నైపుణ్యం కలిగిన వారిచే ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 94900 98422, 92950 15777ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తాడేపల్లి భగత్‌సింగ్ లైబ్రరీ అండ్ స్టడీ సెంటర్ నిర్వాహకుడు ప్రొఫెసర్ బీ శ్రీనివాసరావు, ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వేంకటరమణారావు, కార్మిక పాఠశాల బాధ్యులు రావేళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ షో



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు టాలెంట్ షో నిర్వహించారు. విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు ఆధ్వర్యంలో టాలెంట్ షో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల బహుముఖ ప్రజ్ఞను పరీక్షించారు. అనంతరం కేశవరావు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఈనెల 26న జనరల్ నాలెడ్జ్ క్విజ్ పోటీలు, 27న నాకు నచ్చిన పుస్తకం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో మూడు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఎవరైనా పాల్గొనవచ్చని చెప్పారు. గ్రంథాలయ అధికారి కంచల నాగరాజు మాట్లాడుతూ స్థానిక పాఠశాల విద్యార్థులకు ఇది మంచి అవకాశమని, విద్యార్థులంతా పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లలో ప్రజలు, బాటసారుల సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 64వ డివిజన్ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు కాకొల్లు రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. పార్టీ నాయకులు ఎస్‌కే బాబు, కేకే బాబు, రాజేష్, వరలక్ష్మి, కాకొల్లు సాయిచరణ్, జయరాజ్, పలగాని భాగ్యలక్ష్మి, భవాని, కోరాడ రమణ, పలగాని శివ, రాజ్యలక్ష్మి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు పూర్తయ్యేనా..!

- న్యూఆర్‌ఆర్‌పేట – వైవీరావు ఎస్టేట్ మధ్య వంతెన ప్రారంభం కోసం ఎదురుచూపులు
- రూ.3.50 కోట్లతో వంతెనను నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



న్యూఆర్‌ఆర్‌పేట అపార్ట్‌మెంట్స్ వెనుక బుడమేరుపై నిర్మించిన వంతెన



వంతెన నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డుకు మార్గం లేకపోవడంతో ఆగిపోయిన రోడ్డు పనులు



80 అడుగుల రోడ్డును నిర్మించాల్సిన ప్రాంతం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో వంతెన నిర్మాణ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 3.50 కోట్లతో చేపట్టిన ఈ వంతెన నిర్మాణం దాదాపు ఓ కొలిక్కి రాగా వంతెనకు ఇరువైపులా రోడ్డు మార్గాలను అభివృద్ధి పరిచే పనులు మిగిలి ఉన్నాయి. ఈ పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తే 57, 58వ డివిజన్ ప్రజలతో పాటు వేల మంది ప్రయాణికులకు మేలు కలిగినట్లవుతుంది.

ఇన్నర్‌రింగ్‌రోడ్డు నుంచి నేరుగా ఆర్‌ఆర్‌పేటలోకి..

ఇన్నర్‌రింగ్‌రోడ్డు(100 అడుగుల రోడ్డు) నుంచి జక్కంపూడి రింగ్, వైవీరావు ఎస్టేట్, నందమూరి నగర్ వెనుక ప్రాంతాల మీదుగా న్యూఆర్‌ఆర్‌పేటలోకి వెళ్లేందుకు ఈ వంతెన ఎంతో దోహదపడుతుంది. ఈ ప్రాంతాల మధ్య వంతెన లేకపోవడం, మధ్యలో బుడమేరు అడ్డుగా ఉండటంతో ఈ ప్రాంతాలకు చేరుకోవాలంటే సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సివస్తోంది. అదే ఈ వంతెన అందుబాటులోకి వచ్చినట్లయితే ఇరు డివిజన్ల ప్రజలకు ప్రయోజనకరంగా మారుతుంది.

80 శాతానికి పైగా పనులు పూర్తి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాల మధ్య బుడమేరుపై వంతెన నిర్మాణం చేసేందుకు రంగం సిద్ధమైంది. 2020లో అంచనాలు రూపొందించి సుమారు రూ. 3.50 కోట్లతో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి 80 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత నందమూరి నగర్ ప్రాంతం వైపు పంట కాలువపై రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండటం, ఇతర కారణాలతో పనులకు కాస్త బ్రేక్ పడింది. ఈలోపు ఎన్నికలు రావడంతో వంతెన పనులు నిలిచిపోయాయి.

బుడమేరులో పోసిన బూడిదలా నిధులు

దాదాపు నిర్మాణ పనులన్నీ పూర్తి కాగా వంతెనకు అటూ ఇటూ 80 అడుగుల రోడ్డును నిర్మించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వంతెన నిర్మాణ పనులను పూర్తిగా ఆదమరిచింది. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం బుడమేరులో పోసిన బూడిద మాదిరిగా తయారైందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అందరికీ ఎంతో మేలు



వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభం కావడంతో మేమంతా చాలా ఆనందపడ్డాం. కానీ ఇలా ఆఖరిలో పనులు నిలిచిపోయి నిరుపయోగంగా మారుతుందని ఊహించలేదు. ఈ వంతెన పూర్తి అయితే స్థానిక ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది.

– మల్లల చెన్నకేశవరెడ్డి, స్థానికుడు

వంతెన పూర్తి చేయాలి



బుడమేరుపై నిర్మించిన ఈ వంతెన నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. న్యూఆర్‌ఆర్‌పేటలో కూలినాలి చేసుకునే వారు జక్కంపూడి, పాల ఫ్యాక్టరీ, కబేళా ప్రాంతాల్లో పనులకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

– నెల్లి గోవింద్‌నాయుడు, స్థానికుడు

వసతి గృహాలు, వంటశాల ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో రూ. 90లక్షలతో నూతనంగా అర్చకుల వసతి గృహాలు, వంటశాల, టికెట్ కౌంటర్ నిర్మించారు. సోమవారం అర్చకుల వసతి గృహాలు, వంటశాలను సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టికెట్ కౌంటర్‌ను స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వై సీతారామయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు శుభ్రం చేశారు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): స్థానిక మధురానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిసరాలను ఎట్టకేలకు పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. మధురానగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అలాగే ఇక్కడ వైద్యసేవలు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి సోమవారం మధురానగర్ పట్టణ ఆరోగ్యకేంద్రానికి సుస్తీ శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ జమలయ్య నేతృత్వంలో పట్టణ ఆరోగ్యకేంద్రం పరిసరాలు శుభ్రం చేశారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కోవిడ్–19 కేసులపై సమీక్షించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సింగపూర్, మలేషియాలో పెరుగుతున్న కోవిడ్–19 కేసుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వెంటనే సమీక్షించాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ దేశాల నుంచి రాష్ట్రానికి ప్రయాణాలు పెరిగినందున రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సిటీ సబ్‌స్టేషన్, 11కేవీ నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలో నూతన లైన్ల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7.15 నుంచి 11:15 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కలరోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, గోవింద రాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, వెంకటరత్నం వీధి, కాశేశ్వరరావు రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సామూహిక సీమంతాలు

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని వంగవీటి మోహనరంగా కల్యాణ మండపంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు గర్భిణులకు చీర, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, మాజీ కార్పొరేటర్ పైడి తులసి, డివిజన్ ఇంచార్జి పైడి శ్రీను, జలకం రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు



బెంజిసర్కిల్ వద్ద నగర పర్యటనలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా అధికారులు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన బెంజ్ సర్కిల్, డీవీ మేనర్ రోడ్, జమ్మిచెట్టు సెంటర్, రమేష్ హాస్పిటల్ రోడ్, నిర్మలా కాన్వెంట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒక ప్రాంతంలో డీసిల్టింగ్ చేసినప్పుడు కేవలం సైడ్ డ్రెయినే కాకుండా కల్వర్టుల్లో కూడా ఎలాంటి వ్యర్థాలు, పూడికలు కాలువల్లో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ప్రతిరోజు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి సమస్యలు సేకరించి, నివేదికను సమర్పించాలని ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎస్ఈలు ఇంజినీర్లు పీ సత్యకుమారి, పీ సత్యనారాయణ, జాయిన్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ పీ వెంకట సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన అవసరం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



గ్యాస్ సిలిండర్ మంటలను ఆర్పుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): అగ్నిప్రమాదం నివారణ చర్యలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు, ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఫైర్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగితే సమయ స్ఫూర్తితో వ్యవహరించాలని, వీఎంసీ రికార్డు కీపర్, సిబ్బందికి ప్రమాదాలను ఎదుర్కొనే అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా వారితో మాక్ డ్రిల్‌లో మంటలు ఎలా ఆర్పాలో నేర్పించారు. పనిచేసే కార్యాలయాలోనే కాకుండా ఇంటి వద్ద అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలి, గ్యాస్ సిలిండర్ లీక్ అయితే తడి టవల్ లేదా దుప్పటితో చుట్టేస్తే మంటలు ఆరిపోతాయని, కళాయిలో మంటలు వస్తే వంటగదిలో ఉన్న పిండిని దానిపై చిన్న చిన్నగా వేస్తే మాటలు ఆగిపోతాయని, బాండీలో మంటలు వస్తే ఆక్సిజన్ రానీయకుండా మూతను క్రమంగా కొంచెం కొంచెంగా ఎలా మూస్తే మంటలు ఆగుతాయని అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌లో డెప్యూటీ మేయర్‌లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, వీరమాచినేని లలిత, చెనగిరి రామ్మోహన్, తిరుపతమ్మ, అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సృజన, సూపరిండెంటింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పీ సత్యకుమారి, వీఎంసీ రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎన్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ డీ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం రాజా, ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శంకర్ రావు, నరేష్, గౌతమ్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య



సభలో మాట్లాడుతున్న తమ్మారెడ్డి భరద్వాజ

విజయవాడలీగల్: నిస్వార్థ ప్రజానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని ప్రముఖ సినీదర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పేర్కొన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా అధ్యక్షతన ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. సుందరయ్య నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమని భరద్వాజ పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ కామ్రేడ్ సుందరయ్య జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపర దుర్గా శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టసభల్లో ప్రజల గురించి ప్రత్యేకంగా చర్చించేవారని పేర్కొన్నారు. బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ సుందరయ్య గొప్ప త్యాగజీవి, ప్రజాపక్షపాతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, ఆలూరి సుధాకర్‌రావు, సీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొమ్మసాని రవి, వీ కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు, గవర్నింగ్ బాడీ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరయ్య సేవా కేంద్రం ద్వారా కరోనా రోగులకు ప్రత్యేక సెంటర్ ఏర్పాటుచేసి వారికి అంత్యక్రియలు నిర్వహించిన న్యాయవాది ఆవుల వెంకటరావు బృందాన్ని సత్కరించారు.



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాబూరావు, సీపీఎం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని 58, 59 డివిజన్‌లలోని సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్, డాబాకొట్లు సెంటర్, ఎక్సెల్ ప్లాంట్ ఏరియా, శివాలయం ప్రాంతాల్లో సోమవారం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరికి ఉద్యోగ కల్పన, కూడు, గూడు, గుడ్డ, విద్య వైద్యం అందాలని నిరంతరం పరితపించిన వ్యక్తి సుందరయ్య అని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రజలకు అల్పాహారం, మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. సీపీఎం నాయకులు కే దుర్గారావు, ఎస్‌కే నిజాముద్దీన్, వీ సాంబశివరావు, పీఎస్ఎన్ మూర్తి, సీహెచ్ నాగార్జున, వేముల శ్రీను, ఎస్ విజయలక్ష్మి, దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోలతో ఈఓ సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో ప్రొటోకాల్ దర్శనాలు, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆలయ ఈఓ శీనానాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు ఎస్. రమేష్‌బాబు,పి. చంద్రశేఖర్, జంగం శ్రీనివాసరావులతోపాటు ఇతర ఇంజినీరింగ్ అధికారులు హాజరయ్యారు. అమ్మవారి ఆర్జిత సేవలు, దర్శన ఏర్పాట్లు, భక్తులకు రవాణా సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చకు వచ్చిన అంశాల గురించి ఏఈవోలకు వివరించారు. భక్తులకు సంతృప్తికరంగా అమ్మవారి దర్శనం ఉండేలా చూసుకోవాలని, ఆలయంలో శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు.

అత్త సొమ్ము... మేనల్లుడు తాకట్టు!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఓ మహిళ తనఇంట్లో భద్రపరిచిన బంగారపు నగలను ఆమెకు మేనల్లుడు వరస అయ్యే యువకుడు బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన ఘటన కొత్తపేట పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై మేనల్లుడితో పాటు ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్‌పై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట మాకినవారి వీధిలో బాకి అప్పలనరసమ్మ, యర్రయ్య నివాసం ఉంటున్నారు. యర్రయ్య ఆటోనడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. భార్యభర్తలిద్దరూ కష్టపడి పిల్లల భవిష్యత్తు కోసం సుమారు 15కాసుల పైగా బంగారాన్ని కొనుగోలు చేశారు. లారీ పనులకు వెళ్లే దూరపు బంధువైన కల్లి దుర్గాప్రసాద్‌రెడ్డి కొంతకాలంగా అప్పలనరసమ్మ ఇంటికి వస్తూ ఉన్నాడు. ఈక్రమంలో అప్పలనరసమ్మ ఇంట్లో ఉన్న బంగారం గతేడాది అక్టోబర్‌లో కనిపించలేదు. ఇంట్లో వెతుకుతున్న తరుణంలో ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు సంబంధించిన బిల్లులు కనిపించాయి. కల్లి దుర్గాప్రసాద్‌రెడ్డి ఇంట్లో బంగారపు వస్తువులను 2023 సెప్టెంబర్‌లో బ్రహ్మణ వీధిలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు తీసుకువెళ్లి తాకట్టు పెట్టినట్లు ఆ రశీదులో ఉంది. దుర్గాప్రసాద్‌ను బంగారం గురించి నిలదీయగా, తాను బ్యాంక్ మేనేజర్‌తో కలిసి తాకట్టు పెట్టుకుని ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడినట్లు తెలిపాడు. దీనిపై బ్యాంక్ మేనేజర్‌ని నిలదీయగా, అతను మీకు దిక్కున్న చోట చెప్పుకోమని చెప్పడంతో చేసేది లేక న్యాయవాదిని ఆశ్రయించారు. బంగారం తాకట్టు పెట్టుకునే క్రమంలో తమ సంతకాలను ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం సదరు బ్యాంకుకు వెళ్లి మేనేజర్‌ను విచారించడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడమే వీఎంసీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతోపాటు, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఇందులో మొత్తం 17 ఫిర్యాదులు రాగా పట్టణ ప్రణాళికకు సంబంధించినవి 12, ఇంజినీరింగ్ 3 , రెవెన్యూ 1, వైద్య – ఆరోగ్యం 1 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జీ సృజన, ఎస్ఈ పీ సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీ సోమశేఖర్‌రెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను త్వరితగతిన నిర్మించండి

పటమట(విజయవాడతూర్పు): పేదలకు అందించే ఇళ్లను త్వరితగతిన నిర్మించాలని వీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం మీటింగ్ హాల్లో సోమవారం ఆయన ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం. శివప్రసాద్, కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, హౌసింగ్, వీఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర, ఎండీ శివప్రసాద్ మాట్లాడుతూ పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టర్లకు కేటాయించిన ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి గడువులోపు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి సూపరిండెంటింగ్ ఇంజినీర్ వర్క్స్ పీ సత్యనారాయణ, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ పీ వెంకటనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ వేణుగోపాల్, పీడీ లీలారాణి, హౌసింగ్, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను ఓ యువకుడు ట్రాప్ చేస్తున్నాడని, అతడిని అడిగేందుకు వెళ్లగా దాడికి పాల్పడిన ఘటన సోమవారం భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు చెందిన నారాయణమూర్తి వ్యాపారం చేస్తూ భార్య పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. క్రాంతి అనే యువకుడు అతని భార్యను ట్రాప్ చేస్తున్నాడు. ఈ విషయమై అతడిని నిలదీసేందుకు తన బావమరుదులతో కలిసి క్రాంతి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో క్రాంతి అతని అనుచరులు మరికొందరు గొడవ పడ్డారు. క్రాంతి రోకలితో తలపై బలంగా కొట్టడంతో నారాయణమూర్తి తలకు బలమైన గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాల ఆవరణలో సోమవారం ఉత్సాహంగా జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత తమ పాఠశాల స్నేహితులు, ఉపాధ్యాయులను కలుసుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పాఠశాల హెచ్‌ఎం పరసా వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి హైస్కూల్ హెచ్‌ఎం కే దుర్గారావు, జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు పార్వతీదేవి, ఎం శ్రీనివాసరావు, ఎస్ రాజ్‌కుమార్, మనోహర్, కుమార్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.